సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 3 । జూలై । 2025



టన్ను చీనీ రూ.25 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25 వేలు, కనిష్టం రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



మూసివేత దిశగా బడులు
కూటమి సర్కార్ నిర్వాకంతో ప్రభుత్వ బడులకు తాళాలు పడే ప్రమాదం నెలకొంది. ఈ విద్యాసంవత్సరం 163 స్కూళ్లలో ఒక్కరంటే ఒక్కరూ చేరలేదు. 8లో

గరిష్టం/కనిష్టం 34.5°/22.8°
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 16 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

పంచాయతీకి ట్రాక్టర్ అప్పగింత



పేరూరు పంచాయతీ కేంద్రం వద్ద ట్రాక్టర్‌ను ఉంచిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఎట్టకేలకు ఏడాది తర్వాత పేరూరు మేజర్ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ తిరిగి పంచాయతీకి చేరింది. స్వచ్ఛ భారత్ పనుల కోసం ప్రభుత్వం పేరూరు పంచాయతీకి ట్రాక్టర్ ఇవ్వగా.. కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సొంత పనులకు వాడుకోవడంతో పాటు ఇతర రైతులకు అద్దెకు ఇస్తూ సొమ్ముచేసున్నాడు. దీనిపై 'పంచాయతీకే పంగనామం' శీర్షికన ఈనెల 1వ తేదీ మంగళవారం 'సాక్షి' కథనం ప్రచురించింది. అధికారం అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు సాగిస్తున్న అక్రమాల పర్వాన్ని బట్టబయలు చేసింది. ఈ కథనం తీవ్ర చర్చనీయాంశం కాగా, టీడీపీ నాయకులు నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించారు. వెంటనే ట్రాక్టర్‌ను పంచాయతీకి స్వాధీనం చేయాలని ఆదేశించడంతో.. టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్ బుధవారం ట్రాక్టర్‌ను పంచాయతీ ఆఫీసు వద్దకు తీసుకువెళ్లి కార్యదర్శి సత్యమ్మకు తాళాలు అప్పగించారు. అయితే ఏడాదిగా ట్రాక్టర్‌ను అద్దెలకు ఇచ్చి సంపాదించిన మొత్తాన్నీ పంచాయతీ ఖాతాకు జమ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ టీఎస్ చేతన్




ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 10న జిల్లాలోని కొత్తచెరువులో పర్యటించే అవకాశం ఉందని, ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి సీఎం పర్యటన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లికి వందనం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 10న సీఎం చంద్రబాబు కొత్తచెరువులో పర్యటించే అవకాశం ఉందన్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లకు సంబంధించి ప్రతి శాఖకు బాధ్యతలు అప్పగించామని, లోటుపాట్లు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. సీఎం కాన్వాయ్‌లో స్పెషలిస్ట్ వైద్యులతో పాటు అత్యవసర మందులను, అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ విజయసారథి, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి ఆర్డీఓలు సువర్ణ, మహేష్, వైవీఎస్ శర్మ, డీపీఓ సమత, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, జిల్లా రవాణా శాఖ అధికారి జే.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం తదితరులు పాల్గొన్నారు.

జలజలా తుంగభద్రమ్మ..


- టీబీ డ్యాం 6 క్రస్ట్ గేట్లు ఎత్తివేత



బొమ్మనహాళ్: ఎగువన వర్షాలు భారీగా కురుస్తుండగా తుంగభద్రమ్మ పరుగులు తీస్తోంది. దీంతో అధికారులు బుధవారం జలాశయం 6 క్రస్ట్ గేట్లను ఎత్తి నదికి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 14,136 క్యూసెక్కుల నీటిని నదికి వదులుతున్నారు. డ్యాం ఎగువ భాగంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా రిజర్వాయర్‌కు పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రానికి 32,494 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రసుత్తం జలాశయంలో నీటి నిల్వ 1,633 అడుగులకు గాను 1,625.46 అడుగులకు చేరుకుంది. మొత్తం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 78.100 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో బుధవారం మధ్యాహ్నం డ్యాం క్రస్ట్ గేట్లలో నాలుగింటిని, రాత్రి 7 గంటల సమయంలో మరో రెండింటిని ఎత్తి నదికి నీటిని విడుదల చేశారు.

చీకటి బతుకులు

- ఎర్రకోట.. సమస్యల వేట
- కనీస సౌకర్యాలకు నోచుకోని కాలనీ
- తాగునీరూ బిందె రూ.10 పెట్టి కొనాల్సిందే
- వర్షం వస్తే రోడ్డంతా బురదమయం
- కరెంటు లేక దీపాల వెలుగులోనే భయం భయంగా జీవనం



దీపం వెలుగులో వంట చేసుకుంటున్న మహిళ



ఎర్రకోట కాలనీలోని ఇళ్లు

ఓ ఊరివ్యథ

కదిరి టౌన్: వారంతా కూలీనాలీ చేసుకుని జీవనం సాగించే పేదలు. నిలువ నీడలేక, అద్దెలు చెల్లించే ఆర్థిక స్తోమత లేక రెండేళ్ల క్రితం ప్రభుత్వ స్థలంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం 500 జనాభా అక్కడ జీవనం సాగిస్తోంది. అయినా అధికారులు కనీసం తాగునీరు, విద్యుత్ లాంటి కనీస సౌకర్యాలు కల్పించలేదు. రెండేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా కనికరించే వారే కనిపించలేదు. దీంతో ఆ బడుగు జీవులు చీకట్లోనే జీవితం వెళ్లదీస్తున్నారు.

120 కుటుంబాల నివాసం..

కదిరి మున్సిపాలిటీ 34వ వార్డు పరిధిలోని 1778 సర్వే నంబరులో గల ప్రభుత్వ భూమిలో గుట్టకు అటు, ఇటు దాదాపు 120 పేద కుటుంబాలు నివసిస్తున్నాయి. 500 వరకు జనాభా ఉంది. ఆర్థిక స్తోమతను బట్టి ప్లాస్టిక్ కవర్లు, తడకలతో కూడిన గుడిసెలతో పాటు రేకుల షెడ్లు వేసుకున్నారు. ఈ కాలనీకి ఎర్రకోట అని పేరు కూడా పెట్టుకున్నారు. ఉదయమే అందరూ కూలిపనులకు వెళ్తారు. సాయంత్రం పనులు ముగించుకుని గూడుకు చేరుకుంటారు.

తాగునీటికి కటకట..

ఎర్రకోట కాలనీ పేరుకు మున్సిపాలిటీ పరిధిలో ఉన్నా... తాగునీటి సౌకర్యం లేదు. బయటి ప్రాంతం నుంచి రోజూ ఆటో నీళ్ల ట్యాంకర్ వస్తుంది. బిందె నీరు రూ.10 చొప్పున కొనుగోలు చేయాల్సిందే. కూలీనాలీ చేసుకుని అంతోఇంతో సంపాదించిన సొమ్ములోంచి నీటి కోసం ఒక్కో కుటుంబం కనీసం రూ.50 పైబడి వెచ్చించాల్సి వస్తోంది. వాడుక అవసరాలకు కూడా నీరు కొనాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో స్నానాలు చేయడానికి కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు.



డబ్బులు చెల్లించి ట్యాంకర్ నుంచి నీటిని పట్టుకుంటున్న మహిళలు



కాలనీలో రోడ్డు దుస్థితి

వర్షం వస్తే అంతే సంగతులు..

వర్షాలు వస్తే కాలనీవాసులు పడరానిపాట్లు పడుతున్నారు. కాలనీలో మట్టిరోడ్డు కాస్తా వర్షాలకు బురదమయంగా మారుతోంది. బురదలోంచి ఇళ్లకు చేరుకోవాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. వర్షం పూర్తిగా తగ్గితే గానీ నీటి నిల్వ తగ్గదు. దీంతో రోజుల తరబడి బురదలోనే వారు నివసించాల్సి వస్తోంది. ఇక వర్షాకాలంలో నీరు నిలిచి దోమలు ప్రబలి చాలా మంది అనారోగ్యంతో మంచాన పడుతుంటారు.

సాయంత్రమైతే అంధకారమే

ఎర్రకోట కాలనీలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో సాయంత్రానికే అంధకారం అలముకుంటుంది. దీంతో 120 కుటుంబాల వారు రాత్రి పూట దీపాలు, కొవ్వొత్తులు పెట్టుకొని కాలం గడుపుతున్నారు. రాత్రి వేళ పాములు, విష పురుగులు ఎక్కువగా సంచరిస్తుంటాయని, గుడిసెలోంచి బయటికి రావాలంటే భయంగా ఉంటుందని కాలనీ వాసులు వాపోతున్నారు. గతంలో గంగన్న, వెంకటరమణ, మాబాషాకు తేలు కుట్టి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్న దాఖలాలు ఉన్నాయని గుర్తు చేసుకుంటున్నారు. విద్యార్థులు రాత్రి పూట దీపాల వెలుతురులోనే చదువుకుంటున్నారు.

సమస్యలపై స్పందించేవారేరీ?

ఎర్రకోటలో కనీసం రోడ్లు కూడా లేకపోవడంతో వృద్ధులు, పిల్లలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని ఏ అధికారి దగ్గరికి వెళ్లినా ఎమ్మెల్యే చెప్పితే మీ కాలనీకి సౌకర్యాలు కల్పిస్తామని చెబుతున్నారని మహిళలు తెలిపారు. అధికారులతో పాటు ఇటీవల ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను రెండుసార్లు కలిసి కాలనీ సమస్యలు పరిష్కరించాలని విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.

నీళ్లూ కొనాల్సిందే



మేము నిరుపేదలం. రెక్కలు ముక్కలు చేసుకుంటే పదో పరకో దక్కుతుంది. మా కాలనీకి తాగునీటి సౌకర్యం లేకపోవడంతో రోజువారీ ఆదాయం నుంచి తాగునీటికి ఖర్చు చేయాల్సిన పరిస్థితి. బిందె నీరు రూ.10 చొప్పున కొనాల్సిందే. అనారోగ్య రీత్యా నేను నడవలేను. మా కాలనీకి కనీసం తాగునీటి ట్యాంకర్లయినా పంపాలి.
– ప్రసన్న, ఎర్రకోట కాలనీ

రోడ్డు వేయండి



మేము కూలి పనులు చేసుకుని బతుకుతున్నాం. కాలనీకి రోడ్డు సదుపాయం లేకపోవడంతో వర్షాకాలం కాలనీ నుంచి బయటకు వెళ్లడం వీలు కావడం లేదు. అతికష్టమ్మీద ఉదయం వెళ్లినా..సాయంత్రం బురదమయమైన రోడ్డు, విద్యుత్ సౌకర్యం లేని పరిస్థితిలో తిరిగి ఇళ్లకు చేరుకోలేని పరిస్థితి. కనీస సౌకర్యాలు కల్పించాలని ధర్నా చేసినా.. ప్రయోజనం లేదు.
– ఎస్.లక్ష్మీదేవి, ఎర్రకోట కాలనీ

మా జీవితాల్లో వెలుగులు ఎప్పుడో?



మేము ఎర్రకోటలో రెండేళ్ల నుంచీ ఉంటున్నాం. మా కాలనీ తర్వాత ఏర్పడిన కాలనీల్లోనూ సౌకర్యాలు కల్పించారు. మా కాలనీని మాత్రం విస్మరించారు. మమ్మల్ని మనుషులుగా గుర్తించి కనీస సౌకర్యాలు కల్పించాలి. అంధకారంలో ఉంటున్న మా కాలనీకి విద్యుత్ సౌకర్యం ఎప్పుడు కల్పిస్తారో.. మా జీవితాల్లో వెలుగులు ఎప్పుడు నిండుతాయో.? – గంగోజమ్మ, ఎర్రకోట కాలనీ

అనుమతుల్లేవ్

34వ వార్డు పరిధిలోని ఎర్రకోటలో 120 కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిసింది. అయితే అక్కడ కాలనీ ఏర్పాటుకు అధికారిక అనుమతులు లేవు. మేము ఆ స్థలానికి ఎవరికీ పట్టాలు కూడా ఇవ్వలేదు. అలాంటప్పుడు అక్కడ సౌకర్యాలు ఎలా కల్పిస్తాం..?
– కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి

అధికారులు అన్యాయం చేశారు



తమకు జరిగిన అన్యాయాన్ని కలెక్టర్‌కు చెప్పుకునేందుకు వచ్చిన విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు

- విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల ఆవేదన
- రాజకీయ సిఫారసులకు పెద్దపీట వేశారని ధ్వజం

అనంతపురం అర్బన్: బదిలీల కౌన్సెలింగ్‌లో అధికారులు తమకు తీవ్ర అన్యాయం చేశారని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించలేదన్నారు. ర్యాంక్ (మెరిట్) ఆధారంగా బదిలీలు నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా స్థానాలు కేటాయించారని మండిపడ్డారు. రాజకీయ సిఫారసు ఉన్నవారికి వారు కోరుకున్న స్థానాలు కేటాయించారని వాపోయారు. తమకు జరిగిన అన్యాయాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లేందుకు బుధవారం కలెక్టరేట్‌కు వచ్చిన పలువురు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా సచివాలయ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు గతనెల 28న బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారన్నారు. ఆరోజున కౌన్సెలింగ్‌కు హాజరైన తమ నుంచి ఆప్షన్ ఫారాలు తీసుకుని.. మీ ఆప్షన్లలో ఏదో ఒకటి తర్వాత ఇస్తామని చెప్పారన్నారు. తీరా పోస్టింగ్ ఆర్డర్స్ ఒకటో తేదీన పంపారని, అందులో తామిచ్చిన ఆప్షన్లకు సంబంధం లేని మండలాల్లో పోస్టింగ్ ఇచ్చారన్నారు. ముందు ర్యాంకులో ఉన్న తమను కాదని తరువాత ర్యాంక్ వాళ్లకు తమ స్థానాలు ఇచ్చారని ఆరోపించారు. అంతే కాకుండా దివ్యాంగులు, మెడికల్, ఒంటరి మహిళలు, స్పౌజ్‌కు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఇలా బదిలీల కౌన్సెలింగ్‌లో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చేసిన అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు నేత్ర, జహీర్, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్ కోటా అమలు చేయలేదు

పీహెచ్ కేటగిరీకి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే ఆ కేటగిరీలో ఉన్న నాకు అన్యాయం చేశారు. నేను నల్లమాడ మండలం వేళ్లమద్ది సచివాలయంలో పనిచేస్తున్నా. బదిలీ ఆప్షన్ ఇటుకలపల్లి, బత్తపల్లి సచివాలయం-2, ఆత్మకూరు మండలం బి.యాలేరు ఇచ్చాను. అయితే అవేవీ కాకుండా బుక్కపట్నం మండల అగ్రహారం సచివాలయానికి నన్ను బదిలీ చేశారు.
– శిరీష, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్

ర్యాంక్ ప్రకారం ఇవ్వలేదు

ఉమ్మడి జిల్లాలో నాది 6వ ర్యాంకు. శ్రీసత్యసాయి జిల్లాలో 3వ ర్యాంక్. నేను కదిరిలో పనిచేస్తున్నాను. బదిలీల్లో కదిరి, నల్లచెరువు, గాండ్లపెంట ఆప్షన్ ఇచ్చా. నాకు ముదిగుబ్బ మండలంలో పోస్టింగ్ ఇచ్చారు. నేను ఆప్షన్‌లో ఉంచిన స్థానాలను ఇవ్వకుండా నా తరువాత ర్యాంక్ వారికి కేటాయించారు.
– జనార్దన్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్

ఇష్టానుసారంగా ఇచ్చారు

ఉమ్మడి జిల్లాలో నాది 5వ ర్యాంక్, శ్రీసత్యసాయి జిల్లాలో 2వ ర్యాంక్, నేను తలుపుల మండలంలో పనిచేస్తున్నా. నల్లచెరువు, ఎన్‌పీకుంట, నల్లమాడ మండలాలకు ఆప్షన్ ఇచ్చాను. అయితే నా ఆప్షన్లు కాకుండా తనకల్లు మండలం కోటపల్లి సచివాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. మా తరువాతి ర్యాంకు వారికి మా ఆప్షన్ స్థానాలు ఇచ్చారు.
– సుస్మిత, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్

ఆటంకం సృష్టించారు.. సంజాయిషీ ఇవ్వండి

- గ్రామ సర్వేయర్లకు షోకాజ్

అనంతపురం అర్బన్: సచివాలయ గ్రామ సర్వేయర్లకు సంబంధించి గత నెల 29న జరిగిన బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియకు అడుగడుగునా ఆటంకాలు, అసౌకర్యం కల్పించారంటూ ముగ్గురు గ్రామ సర్వేయర్లకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు సర్వే భూరికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్ సంజాయిషీ కోరుతూ అమడగూరు మండలం జౌకులకొత్తపల్లి సచివాలయ గ్రామ సర్వేయర్ ఎం.మహేష్‌నాయుడు, అగళి మండలం అగళి సచివాలయ గ్రామ సర్వేయర్ యు.తిప్పేస్వామి, అనంతపురం జిల్లా గుత్తి మండలం కరడికొండ సచివాలయ గ్రామ సర్వేయర్ ఎస్.రవికుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నోటీసు అందిన మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కూటమి మోసాలను ప్రజలందరికీ వివరిస్తాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉషశ్రీ చరణ్, నాయకులు

రొద్దం: అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలోనే అన్ని వర్గాలనూ మోసం చేసిన కూటమి సర్కార్ అసమర్థపాలనను ప్రజలందరికీ వివరించేందుకు వైఎస్సార్ సీపీ 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. బుధవారం ఆమె రొద్దంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ నేతలతో కలిసి క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ..కూటమి సర్కార్ చేసిన మోసాలను ప్రజలందరికీ వివరిస్తామన్నారు. ఆరు వారాలపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని గ్రామగ్రామానా నిర్వహిస్తామన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు..అమలు తీరు..ఏడాది కూటమి పాలనలో ఒక్కో కుటుంబం ఎంతమేర నష్టపోయిందో వివరిస్తామన్నారు.

ఒక్క హామీ నెరవేర్చలేకపోయారు..

ఎన్నికల వేళ చంద్రబాబు ప్రజలందరికీ అరచేతిలో వైకుంఠం చూపారన్నారు. ప్రభుత్వ పథకాలు అందిస్తామంటూ గ్యారెంటీ వారంటీ కార్డులు ఇచ్చారన్నారు. కానీ ఏడాది పాలనలో ఒక్క హామీ నెరవేర్చలేకపోయారన్నారు. నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డలకు నెలకు రూ.1,500 ఆర్థిక సాయం, 20 లక్షల ఉద్యోగాలు ఇలా ఏ ఒక్కటీ అమలు చేయలేకపోయారన్నారు. 'తల్లికి వందనం' అమలుకూ సవాలక్ష ఆంక్షలు పెట్టారన్నారు. ఉచిత గ్యాస్ ఎవరికి అందుతుందో కూడా తెలియడం లేదన్నారు. పెనుకొండ నియోజకవర్గం నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత... బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ పథకం గురించి మాట్లాడటం లేదన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. అంతకుముందు ఉషశ్రీచరణ్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, ఎంపీటీసీ సభ్యురాలు కురుబ రత్నమ్మ, వైఎస్సార్ సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, నాయకులు ఎస్. నారాయణరెడ్డి, చిలకల రవి, సి.నారాయణరెడ్డి, సినిమా నారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, అమీర్, నరేంద్రరెడ్డి, తిమ్మయ్య, జట్టి శ్రీనివాస్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పురం' మున్సిపాలిటీ నిధులకు కన్నం

- టెలికాం రిస్టోరేషన్‌లో అవకతవకలు
- రూ.33.94 లక్షలు దారి మళ్లినట్లు అనుమానాలు



చిలమత్తూరు: హిందూపురం మున్సిపాలిటీ ఆదాయానికి కన్నం వేశారు. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ పనులకు గానూ ఎయిర్‌టెల్ సంస్థ నుంచి మున్సిపాలిటీకి రావాల్సిన మొత్తంలో ఏకంగా రూ. 33.94 లక్షలు కోత వేశారు. ఇలా ఓ ప్రైవేటు సంస్థకు లబ్ధి కలిగేలా వ్యవహరించిన వైనం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

ఏం జరిగిందంటే.....

పట్టణంలో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వేసేందుకు భారతీ ఎయిర్‌టెల్ సంస్థ సిద్ధమైంది. కేబుల్ వైరు వేసేందుకు మెటల్ రోడ్డు, సీసీ రోడ్లను తవ్వాల్సి ఉంటుంది. ఇందుకు కలిగే నష్టానికి గానూ మున్సిపాలిటీకి నిర్ణయించిన మొత్తాన్ని డీడీ రూపంగానో, నేరుగా మున్సిపాలిటీ బ్యాంకు ఖాతాలోనో జమ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జూన్ నెలలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో 7,700 మీటర్లు సీసీ రోడ్డు, 2,200 మీటర్ల మేర మెటల్ రోడ్డుల గుండా ఫైబర్ కేబుల్ వేయాలని భారతీ ఎయిర్‌టెల్ సంస్థ నిర్ణయించుకుంది. ఇందుకు గానూ 2022-23 ధరలకు అనుగుణంగా పరిహారం చెల్లించేందుకు సిద్ధమైంది. అలాగే ప్రతి ఏటా 10 శాతం అదనంగా పెంచి అంచనాలు తయారు చేయాల్సి ఉంటుంది. 2022-23 ప్రకారం మీటరుకు రూ. 464 మేర మున్సిపాలిటీకి చెల్లించాల్సి ఉంది. ఏటా 10 శాతం పెంచితే..2025-26 సంవత్సరం నాటికి 30 శాతం అంచనా పెంచి మున్సిపాలిటీకి చెల్లించేలా అంచనాలు తయారు చేయాలి. ఆ లెక్కన మీటరుకు రూ.464 మేర చెల్లించాల్సి ఉండగా..మూడేళ్లకు 30 శాతం అదనంగా అంటే రూ. 139 చేరిస్తే మీటరుకు రూ. 603 చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా మెటల్ రోడ్డుకు 2022-23 లెక్క ప్రకారం మీటరుకు రూ.295 చెల్లించాల్సి ఉంది. మూడేళ్లకు పెంచాల్సిన మొత్తం రూ.89 కాగా పాత ధరనే చెల్లించేలా అంచనాలు తయారు చేసి ఆమోదించారు. దీంతో మున్సిపాలిటీకి రావాల్సిన మొత్తంలో రూ.33.94 లక్షలు కోత పడింది. కాగా పాత ధరల మేరకే ఇప్పుడూ డబ్బు చెల్లించేలా టెలికాం సంస్థ యాజమాన్యానికి ఏఈ శంకర్ ఈ ఎస్టిమేషన్ వేసి డిమాండ్ నోటీసు ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంస్థకు రాసిన లేఖలో సీసీ రోడ్డు అని పేర్కొనగా, ధర మాత్రం మెటల్ రోడ్డుగా ఉంది.

అధికారపార్టీ నేతల పాత్రపై అనుమానాలు..?

ఈ తతంగం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉన్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెలికాం సంస్థ నుంచి మున్సిపాలిటీకి అందాల్సిన నిధులు ఎమ్మెల్యే కార్యాలయానికి మళ్లినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపాలిటీకి రూ.లక్షలు నష్టం కలిగేలా కొందరు నేతలు అధికారులతో చేతులు కలిపి ఈ కుంభకోణం చేసినట్టుగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

క్లుప్తంగా

ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు



వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: అత్యాధునిక టెక్నాలజీ సాయంతో రూపొందించిన వాహనాల ద్వారా ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన ఒక బుల్లెట్, 15 అపాచీ, 5 శక్తి వాహనాలను ఎస్పీ రత్న జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. శాంతి భద్రతల సమస్యలు, అవాంఛనీయ ఘటనలు తలెత్తినప్పుడు ట్రాఫిక్ స్తంభించిన సమయాల్లో వేగంగా చేరుకుని పరిస్థితిని చక్కబెట్టేందుకు ఈ వాహనాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ వాహనాలను జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం సబ్ డివిజన్లకు కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, నర్సింగప్ప, శివనారాయణ స్వామి, ఆదినారాయణ, హేమంత్‌కుమార్, మహేష్, ఆర్ఐలు వలి, మహేష్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


‘సుప్రీం’ నిర్ణయం హర్షణీయం

- విశ్రాంత జడ్జి కిష్టప్ప



అనంతపురం ఎడ్యుకేషన్: అనాదిగా అణచివేయబడిన ఎస్సీ, ఎస్టీలకు ఉన్నత న్యాయస్థానాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ నిర్ణయించడం హర్షణీయమని విశ్రాంత న్యాయమూర్తి కిష్టప్ప పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ఉన్న ప్రతి పౌరునికి సమాన హక్కులు ఉండాలన్నారు. కానీ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు గడిచినా దేశంలోని ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తుల నియామకాల్లో రిజర్వేషన్ల అమలు లేకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ ఉన్నతమైన మనసుతో ఆలోచించి ఉన్నత న్యాయస్థానాలలో కూడా ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లు అమలు చేయాలని భావించడం గర్వించదగ్గ విషయమన్నారు. దేశవ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాలు ఆయనకు రుణపడి ఉంటాయన్నారు. అలాగే అణచివేతకు గురైన వెనుకబడిన తరగతుల వారు జనాభాలో 50 శాతానికి పైగా ఉన్నారని, వారికి కూడా ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తుల నియామకాల్లో దామాషా ప్రకారం రిజర్వేషన్లు వర్తింపజేసి, న్యాయం చేయాలని కోరారు. ప్రధాన మంత్రి, మంత్రివర్గం, పార్లమెంటు సభ్యులు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ నాయకులు, మేధావులు, ప్రజలందరూ ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలోచనను బలపరచాలని విజ్ఞప్తి చేశారు.

మూసివేత దిశగా.. సర్కార్ బడులు



ప్రభుత్వ బడి అంటే అమ్మ ఒడి. అమ్మా నాన్న కూలికి వెళితే అక్కున చేర్చుకుని విద్యా బుద్ధులు నేర్పుతుంది. సమాజంలో ఎలా బతకాలో నేర్పుతుంది. ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది. పెద్దలను గౌరవించండి.. తల్లిదండ్రులను పూజించండి అనే సంస్కారాన్ని అలవరుస్తుంది. అలాంటి బడి ప్రస్తుతం కూటమి ప్రభుత్వ చర్యలతో మూత పడేదిశగా పయనిస్తోంది. ప్రభుత్వం అవలంభిస్తున్న అశాస్త్రీయ విధానాల కారణంగా 2025–26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో చేరే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది.

- జిల్లాలోని 163 పాఠశాలల్లో 1వ తరగతి ప్రవేశాలు నిల్
- కూటమి ప్రభుత్వ తీరుతో పాఠశాల విద్య నిర్వీర్యం
- బడుల్లో విద్యార్థులను చేర్పించే ప్రయత్నమే చేయని వైనం
- శిక్షణ పేరుతో ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి
- భారీగా తగ్గిన విద్యార్థుల సంఖ్య

పుట్టపర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ప్రభుత్వ విద్య నిర్వీర్యమైంది. ప్రభుత్వం అవలంభిస్తున్న అశాస్త్రీయ విధానాలతో ఇప్పటికే జిల్లాలోనే చాలా పాఠశాలలు మూతపడ్డాయి. మరికొన్ని మూత పడే దిశగా నడుస్తున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోవు రోజుల్లో పల్లెల్లో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగు కాక తప్పదనే భావన అందరిలోనూ వ్యక్తమవుతోంది.

జగన్ హయాంలో పాఠశాలల్లో పెరిగిన ప్రవేశాలు..

ఒకప్పుడు శిథిలమైన భవనాలు, పెచ్చులూడిన గచ్చులు, విరిగిపోయిన బల్లలు, వర్షం పడితే కారుతున్న గదులతో ప్రభుత్వ పాఠశాలలు దయనీయంగా ఉండేవి. పాఠశాలలలో అపరిశుభ్ర వాతావరణం ఉండేది. కనీసం టాయిలెట్లు కూడా లేని పరిస్థితులు విద్యార్థులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసేవి. ఇలాంటి పరిస్థితుల్లో ఏపీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. డిజిటల్ తరగతి గదులతో కార్పొరేట్ లుక్‌ను సొంతం చేసుకున్నాయి. నూతన విద్యావిధానానికి అనుగుణంగా అన్ని సంస్కరణలు పూర్తిగా అమల్లోకి తీసుకువచ్చారు. విద్యార్థుల సంఖ్యకు తగిన నిష్పత్తిలో ఉపాధ్యాయులను నియమించారు. డ్రాపౌట్లను సైతం బడి బాట పట్టించేలా అమ్మ ఒడి పథకంతో పాటు జగనన్న గోరుముద్ద, విద్యా కానుక, విద్యా వసతి, విద్యా దీవెన తదితర పథకాలను అత్యంత పారదర్శకంగా అమలు చేయడంతో ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది.

జిల్లాలో 1వ తరగతిలో అడ్మిషన్లు లేని పాఠశాలలు ఇలా..

నియోజకవర్గం	అడ్మిషన్లు లేని పాఠశాలల సంఖ్య
పుట్టపర్తి	25
ధర్మవరం	18
కదిరి	47
హిందూపురం	12
పెనుకొండ	18
మడకశిర	28
రాప్తాడు	15
మొత్తం	163

నాడు ఉపాధ్యాయులు బోధనకే పరిమితం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులను ఎస్‌ఈఆర్‌టీ సూచనలకు మేరకు బోధనకే పరిమితం చేసేలా అప్పటి సీఎం వైఎస్ జగన్ పటిష్ట చర్యలు తీసుకున్నారు. పలురకాల ఆప్స్ కన్నాం రియల్‌టైం డేటా ఉండేలా, డూప్లికేషన్ లేకుండా చూడాలన్న ఎస్‌ఈఆర్‌టీ సిఫార్సును అమల్లోకి తీసుకువచ్చారు. అటెండెన్స్‌ను ఫిజికల్‌గా కాకుండా ఆన్‌లైన్ పద్ధతుల్లో తీసుకోవాలన్న సిఫార్సునూ అమలు చేశారు. పలు రకాల మీటింగులతో సతమతమవుతున్న హెడ్‌మాస్టర్లకు ఊరటనిస్తూ సమన్వయంకోసం నెలకు ఒకే సమావేశం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. వైఎస్ జగన్ తీసుకున్న చర్యలతో జిల్లాలోని 2,074 ప్రభుత్వ పాఠశాలలు 1.45 లక్షల మంది విద్యార్థులతో బలోపేతమయ్యాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడాదిలోనే ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడంతో పాటు వివిధ రకాల శిక్షణ పేరుతో పాఠశాలలకు దూరం చేసింది. సంస్కరణల పేరుతో పాఠశాలల విలీనానికి తెరతీసింది. ఫలితంగా జగన్ హయాంలో జిల్లాలో 2,074 పాఠశాలలు ఉండగా ఇప్పుడు వాటి సంఖ్య 2,011కు చేరుకుంది. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడంతో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గుతూ వస్తోంది. జగన్ హయాంలో జిల్లాలో 1.45 లక్షల మంది విద్యార్థులు ఉండగా తాజాగా ఈ సంఖ్య 1.15 లక్షలకు చేరుకుంది. 2025–26 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని 163 ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

మరిన్ని ప్రోత్సాహకాలు కల్పించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహకాలు అందించాలి. లేకపోతే ప్రభుత్వ బడుల మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. ముఖ్యంగా ఫౌండేషన్ స్కూళ్లలో చిన్నారుల చేరికలను ప్రోత్సహిస్తే పై తరగతులలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

– పీవీ రమణారెడ్డి, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు, పుట్టపర్తి

ప్రభుత్వ తీరుతో నష్టం



ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన కాలంలో ఉపాధ్యాయుల బదిలీలు, శిక్షణలు నిర్వహించాలి. ఈ ఏడాది పాఠశాలల ప్రారంభంలోనే బదిలీలు చేపట్టారు. ఇదే సమయంలోనే శిక్షణ పేరుతో తీవ్ర ఒత్తిడి పెంచారు. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించలేక ఉపాధ్యాయులు సతమతమయ్యారు. దీంతో 1వ తరగతి చేరే విద్యార్థులు కరవయ్యారు. ప్రభుత్వ తీరుతో తీరని నష్టం చేకూరుతోంది.

– బడా హరిప్రసాదరెడ్డి, ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స



శస్త్రచికిత్స అనంతరం రోగిని చూపుతున్న గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ షంషాద్ బేగం, వైద్య బృందం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లోని గైనిక్ విభాగం వైద్యులు అరుదైన శస్త్రచికిత్సతో రోగికి ప్రాణం పోశారు. వివరాలు... గుత్తికి చెందిన లక్ష్మి గత నెల 23న ఆయాసం, రక్త హీనతతో బాధపడుతూ జీజీహెచ్‌లోని గైనిక్ ఓపీకి వచ్చింది. ఆమె పరిస్థితిని గమనించిన వైద్యులు అడ్మిట్ చేసుకుని,, పలు రకాల స్కానింగ్‌లు నిర్వహించారు. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం 4.3 ఉన్నట్లు నిర్ధారణ కావడంతో పాటు గర్భసంచికి రెండు వైపులా భారీ పరిమాణంలో కణితులు పెరిగినట్లుగా గుర్తించారు. విషయాన్ని గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం దృష్టికి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిస్సార్ బేగం, అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌజన్య తీసుకెళ్లి చర్చించారు. తీవ్ర రక్త హీనతతో బాధపడుతున్న ఆమెకు వెంటనే శస్త్ర చికిత్స చేయలేమని హెచ్‌బీ 10 శాతానికి చేరుకున్న తర్వాత ఆపరేషన్ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో రక్తం ఎక్కిస్తూ వచ్చారు. హిమోగ్లోబిన్ శాతం మెరుగు పడిన తర్వాత బుధవారం డాక్టర్ షంషాద్‌బేగం నేతృత్వంలో డాక్టర్ నిస్సార్ బేగం, డాక్టర్ సౌజన్య, పీజీలు డాక్టర్ ఊర్మిళ, డాక్టర్ రమణి, అనస్థీషియా హెచ్ఓడీ డాక్టర్ సుబ్రహ్మణ్యం, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేంద్ర, స్టాఫ్‌నర్సులు సుప్రియ, ఉషారాణి బృందంగా ఏర్పడి శస్త్రచికిత్స చేశారు. దాదాపు రెండున్నర గంటల పాటు శ్రమించి 6 కిలోల బరువున్న భారీ కణితులను తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం లక్ష్మి ఆరోగ్యం కుదుట పడుతోందని డాక్టర్ షంషాద్ బేగం తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అయ్యే ఈ తరహా శస్త్ర చికిత్సను సర్వజనాస్పత్రిలో పూర్తి ఉచితంగా చేసినట్లు తెలిపారు. తొలగించిన కణితిని బయాప్సీకి పంపామని, క్యాన్సర్ నిర్ధారణ అయితే తదుపరి చికిత్సకు రెఫర్ చేస్తామని పేర్కొన్నారు.

మంత్రి కేశవ్‌కు సమస్యల ఏకరవు



మంత్రి పయ్యావుల కేశవ్‌కు సమస్యలు వివరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కూడేరు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏకరవు పెట్టారు. కూడేరు మండలం జయపురంలో బుధవారం మంత్రి కేశవ్ పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులందరూ ఆయనను కలిసి, సమస్యలపై వినతి పత్రం అందజేశారు. రోజూ ఉదయం 6 గంటలకే పంచాయతీల్లో ఉండాలని, చెత్త సేకరణ, క్లోరినేషన్ చేసేటప్పుడు ఆ రోజు దిన పత్రిక పట్టుకొని నోట్ కమ్ ఫొటో దిగాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ, పంచాయతీ రాజ్ కమిషనర్ ఇటీవల వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించినట్లు గుర్తు చేశారు. రోజూ ఉదయం 6 గంటలకే వెళ్లడం చాలా ఇబ్బందవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖలను వేరు చేసి పంచాయతీరాజ్ పనులను మాత్రమే తమకు అప్పగించేలా చూడాలని విన్నవించారు. స్పందించిన మంత్రి.. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్, కార్యదర్శులు రాఘవ, నాగరాజు, హరీష్, వెంకటనారాయణ,రమాదేవి, సుభాషిణి, లక్ష్మీకాంతమ్మ, సూర్య తదితరులు పాల్గొన్నారు.

రాకెట్లలో దళిత యువ రైతుపై దాడి



బాధితుడు హనుమంతు

ఉరవకొండ: మండలంలోని రాకెట్లలో దళిత యువ రైతు హనుమంతుపై అదే గ్రామానికి చెందిన చిన్న సుంకప్ప కుటుంబసభ్యులు దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... రాకెట్లలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న దళిత వెంకటేష్ కుమారులు హనుమంతు, రామాంజనేయులు కలిసి ఇటీవల నెట్టం రాధాకృష్ణ నుంచి సర్వే నంబర్ 320–బీ1లోని 74 సెంట్లలో 15 సెంట్లను కొనుగోలు చేశారు. ఈ స్థలానికి చెక్కు బందీ మేరకు దక్షిణం వైపు బండి రస్తా ఉంది. భూమి విక్రయించే ముందు రాధాకృష్ణ కుటుంబసభ్యులు చూపించిన సర్వే హద్దుల్లోనే హనుమంతు సోదరులు పంట దిగుబడిని, పశువుల మేత వామిని హనుమంతు వేశాడు. అయితే ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన చిన్న గుండ్లొల్ల చిన్న సుంకప్ప కుటుంబ సభ్యులు రెండు నెలల క్రితం దౌర్జన్యంగా ఆక్రమించి, అందులో ఎరువులను, మట్టిని వేసుకున్నారు. తమ స్థలంలోకి ఎందుకు చొరబడుతున్నారని అడిగితే.. ఇది మాదే స్థలం అంటూ ఎదురు తిరిగారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఏడుగంటల సమయంలో మరోమారు మరికొంత స్థలాన్ని ఆక్రమించేందుకు ముళ్లకంపలు తొలగించడంతో హనుమంతు గమనించి ప్రశ్నించాడు. అంతే చిన్న సుంకప్ప, ఆయన కుటుంబసభ్యులు చందు, మణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాదిగ లం... కొ.. అంటూ దూషణలకు పాల్పడటమే కాకుండా కిందపడేసి చెప్పులతో కొట్టారు. కాసేపటి తర్వాత పెదనాన్న, పెద్దమ్మ వచ్చి అతడిని వారి నుంచి విడిపించుకుని ఇంటికి తీసుకెళ్లారు. అయినా శాంతించని చిన్నసుంకప్ప కుటుంబ సభ్యులు మరోమారు ఇంటిలోకి చొరబడి హనుమంతుపై చెప్పులు, కట్టెలతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఆ రాత్రి భయంభయంగా గడిపిన బాధితుడు బుధవారం మధ్యాహ్నం ఉరవకొండ పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. తమ భూమిలోకి అకారణంగా ప్రవేశించి, ఆక్రమణకు పాల్పడి, ఇదేమని అడిగిన తనపై చెప్పులతో దాడిచేసి, కులం పేరుతో దూషించారని, వారి నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

300 మామిడి చెట్ల నరికివేత



మామిడి చెట్లు నరికి వేసిన దృశ్యం

పుట్టపర్తి టౌన్: మండలంలోని వెంగలమ్మచెరువు గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు వీరనారప్ప తోటలోని మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. మూడేళ్ల క్రితం దాదాపు 400 మామిడి మొక్కలను ఆయన నాటారు. మంగళవారం సాయంత్రం తోటలో పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తోటలోకి చొరబడి 300 చెట్లను నరికి వేశారు. బుధవారం మధ్యాహ్నం రైతు కుటుంబ సభ్యులు తోట వద్దకెళ్లి చూడగా నరికి వేసిన చెట్లు కనిపించాయి. ఘటనపై పుట్టపర్తి రూరల్ పీఎస్ ఎస్ఐ లింగన్నకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. తన దాయాదులు లింగప్ప, రాము, లక్ష్మీనారాయణపై అనుమానాలు వ్యక్తం చేశారు. గతంలో వారు తనపై దాడి చేశారని, ఆర్థికంగా తనను దెబ్బతీసేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడి ఉంటారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, నరసారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధితుడికి ధైర్యం చెప్పారు.

‘తల్ సైనిక్’ ఎంపికే లక్ష్యం కావాలి

- ఎన్‌సీసీ కర్నూలు గ్రూప్ కమాండర్ అలోక్ త్రిపాఠి



ఎన్‌సీసీ క్యాడెట్లకు పతకాలు అందజేస్తున్న గ్రూప్ కమాండర్ అలోక్ త్రిపాఠి

కూడేరు: ఈ ఏడాది ఆగస్టులో న్యూఢిల్లీలో జరిగే తల్ సైనిక్ క్యాంప్‌నకు ఎంపిక కావడమే లక్ష్యంగా సాధన చేయాలని ఎన్‌సీసీ క్యాడెట్లకు కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి సూచించారు. కూడేరు మండలంలోని ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ–5 ఎన్‌సీసీ శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన 500 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. బుధవారం కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి హాజరై, మ్యాప్ రీడింగ్, ఫైరింగ్‌లో శిక్షణను పరిశీలించారు. ఏకాగ్రత, ఆత్మ విశ్వాసమున్నపుడే అన్నింటా రాణించగలుగుతారని పేర్కొన్నారు. అనంతరం శిక్షణలో ప్రతిభ చూపిన క్యాడెట్లకు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు సునీత, రాజ్యలక్ష్మి, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

103 మంది విద్యార్థులకు ఏకోపాధ్యాయురాలా?



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

- పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపిన గ్రామస్తులు

డి హీరేహాళ్(రాయదుర్గం): ఏకోపాధ్యాయురాలితో తమ పిల్లల చదువులు ఎలా సాగుతాయంటూ కర్ణాటక సరిహద్దున ఉన్న డి.హీరేహాళ్ మండలం మలపనగుడి గ్రామస్తులు బుధవారం పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. 103 మంది విద్యార్థులుంటే ఒక్క ఉపాధ్యాయురాలు ఎలా నెట్టుకొస్తోందో చెప్పాలంటూ నిలదీశారు. నిత్యం హాజరు వేయడం, అల్లరి చేయకుండా కంట్రోల్ చేయడం మినహా పుస్తకాలు తెరవలేక పోతున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై ఎంఈఓకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ప్రైవేటు బడుల్లో ఖరీదైన చదువులకు పంపడం తమ వల్లకాదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మరో ఇద్దరు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు.

‘స్మార్ట్‌మీటర్ల’పై క్యూఆర్ కోడ్‌తో పోరాటం : సీపీఎం



క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుపై ప్రజా నిరసన ప్రభుత్వానికి తెలియజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలిపారు. ప్రజలతో క్యూర్‌కోడ్ స్కాన్ చేయించి తమ వ్యతిరేకతను నేరుగా సీఎం కార్యాలయానికి తెలియజేసేలా చర్యలు తీసుకున్నారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, కార్యవర్గ సభ్యులతో కలిసి క్యూఆర్ కోడ్ ప్రతులను ఆయన విడుదల చేసి, మాట్లాడారు. ఈ నెల 6న ప్రజా సముదాయం ఉండే కూడళ్లలో ప్రజల ద్వారానే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయిస్తామన్నారు. ఈ విధానానికి స్వస్తి పలికేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంలో భాగంగా చేపట్టిన క్యూఆర్ కోడ్ పోరులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, కృష్ణమూర్తి, చంద్రశేఖరరెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో ఢిల్లీ వాసి మృతి

పుట్టపర్తి టౌన్: సత్యసాయి సన్నిధిలో శేష జీవితం గడిపేందుకు వచ్చిన ఢిల్లీకి చెందిన సత్యకుమార్ మధుకరన్ మీనన్ (64) మృతి చెందారు. తోడు ఎవరూ లేని ఆయన కొన్ని రోజుల క్రితం పుట్టపర్తికి వచ్చి ప్రియాంక అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. నాలుగు రోజులుగా గది తలుపులు తీయలేదు. బుధవారం ఉదయం ఆయన నివాసముంటున్న గది నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో సీఐ సునీత, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. తలుపులు బద్దలు కొట్టి లోపలకు ప్రవేశించి, మృతదేహాన్ని గుర్తించారు. గుండె నొప్పి కారణంగా కింద పడి మృతి చెందినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణ అయింది. పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు నిర్వహించినట్లు కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

గోరంట్ల: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. గోరంట్ల మండలం కసిరెడ్డిపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటు వెళుతున్న వ్యక్తిని వాహనం ఢీకొంది. ప్రమాదంలో రోడ్డుపై పడిన అతని తల మీదుగా వాహనం చక్కాలు దూసుకెళ్లాయి. దీంతో మృతుడు ఎవరైంది ఆచూకీ తెలియకుండా పోయింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో పాటు ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం ఉదయం పరిశీలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లుగా నిర్ధారించి, కేసు నమోదు చేశారు.

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య



మృతుడు లింగారెడ్డి

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రియాంక నగర్‌లో నివాసముంటున్న లింగారెడ్డి(48) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య లక్ష్మీదేవి, ఓ కుమారుడు ఉన్నారు. వంట పనితో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో బుధవారం భార్యతో గొడవపడిన ఆయన క్షణికావేశంలో ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కిందకు దించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ధర్మవరం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బంగారు నగల అపహరణ

హిందూపురం: స్థానిక మార్కండేయ నగర్‌లో నివాసముంటున్న లేపాక్షి పశువైద్యశాఖ ఉద్యోగి కృష్ణవేణి ఇంట్లో చోరీ జరిగింది. మంగళవారం ఇంటికి తాళం వేసి కృష్ణవేణి కుటుంబసభ్యులు మరో ఊరికి వెళ్లారు. విషయాన్ని గుర్తించిన దుండగులు అదే రోజు తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలోని 10 తులాల బంగారు నగలు, పట్టుచీరలు, విలువైన సామగ్రిని అపహరించారు. బుధవారం ఉదయం తిరిగి వచ్చిన ఇంటి యాజమాని ఇంట్లో జరిగిన చోరీని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి నిందితుల వేలి ముద్రలను సేకరించారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.